రైతన్నలకు పెద్దపీట

- సహకార రంగంలో విప్లవాత్మక మార్పులు
- ఆర్థిక లావాదేవీలన్నీ ఆన్‌లైన్‌లోనే
- రుణ మంజూరులో చిన్న, సన్నకారు రైతులకు పెద్దపీట
- స్థానికంగానే రూ.5 లక్షల వరకు రుణం
- ఆర్బీకేలు, పీఏసీఎస్‌ల అనుసంధానంతో బహుళ ప్రయోజనాలు
- కౌలు రైతులు, జేఎల్‌జీ గ్రూపులకూ రుణాలు



ఆనందపురం : రైతులకు స్థానికంగా, సులభంగా ఆర్థిక పరపతి కల్పించడానికి ఏర్పాటు చేసిన ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల (పీఏసీఎస్)ను నాటి టీడీపీ ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో వాటి నిర్వహణ భారంగా మారింది తప్ప రైతులకు ఏమాత్రం ఉపయోగపడలేదు. అవి అవకతవకలకు చిరునామాగా మారిపోయాయి. పాలకమండళ్లపై పర్యవేక్షణ లేకపోవడంతో వారు ఇష్టానుసారంగా వ్యవహరించడంతో తీవ్రనష్టాల్లో కూరుకుపోయిన సహకార సంఘాలు తమ పరపతిని పూర్తిగా పోగొట్టుకున్నాయి. కొన్ని సంఘాలైతే దివాళా తీసి మూసివేత వరకూ వెళ్లాయి. ఈ దశలో దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సీఎంగా ఉన్న కాలంలో ఉదారంగా నిధులు కేటాయించి సహకార సంఘాలకు పునర్జీవనం పోశారు. అతని వారసునిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత సహకార సంఘాలపై ప్రత్యేక దృష్టి సారించి కొత్త పుంతలు తొక్కించారు. రైతుల వివరాలు ఆన్‌లైన్ చేయించి సహకార సంఘాల వెబ్‌సైట్‌తో అనుసంధానం చేయడంతో అక్రమాలకు అడ్డుకట్ట పడింది. రైతుకు ఎంత అర్హత ఉంటే అంతే రుణం పొందే విధానాన్ని పారదర్శకంగా తీసుకు రావడంతో బినామీ రుణాలకు క్లోం పడింది. అలాగే ప్రభుత్వం నాబార్డు, ఇతర సంస్థల ద్వారా నిధులు సమకూర్చడంతో సహకార సంఘాలు నేడు అభివృద్ధి బాటలో పయనిస్తున్నాయి.

వాణిజ్య బ్యాంకులుగా రుపాంతరం

ఒకప్పుడు కేవలం పంట రుణాలకే పరిమితమైన సహకార సంఘాలు ప్రస్తుతం వాణిజ్య బ్యాంకులుగా రూపాంతరం చెంది మెరుగైన సేవలు అందిస్తున్నాయి. వ్యవసాయ అనుబంధ పరిశ్రమలకు, భూముల అభివృద్ధికి, బంగారంపైన, యంత్రాల కొనుగోలుకు, ఉమ్మడి బాధ్యత గ్రూపులకు (జేఎల్‌బీ) అర్హతను ప్రామాణికంగా తీసుకుని రుణాలు అందజేస్తున్నాయి. సంఘంలో గల ప్రతి సభ్యుడికి కిసాన్ క్రెడిట్ కార్డు అందజేయడం వల్ల అవసరమైన సమయంలో రైతులు ఎరువులు, పురుగుల మందులు, విత్తనాలు కొనుగోలు చేయడానికి అవకాశం కలుగుతోంది.



శొంఠ్యాం సహకార సంఘ కార్యాలయం

రుణ మంజూరు పరపతి పెంపు

సహకార సంఘాల ద్వారా ఒకప్పుడు రూ.3 లక్షలు వరకు మాత్రమే రుణం మంజూరు చేయడానికి అవకాశం ఉండేది. అంతకు మించితే కేంద్ర సహకార బ్యాంకు బ్రాంచి ద్వారా పొందాల్సి వచ్చేది. కానీ ప్రస్తుతం రూ.5 లక్షల వరకు రుణాలు ఇచ్చే వెసులుబాటు కల్పించారు. ఇంకా దాన్ని రూ.10 లక్షల వరకు పెంచే యోచనలో రాష్ట్ర ప్రభుత్వం ఉంది. ఆ ప్రతిపాదన కార్యరూపం దాల్చితే పీఏసీఎస్‌ల అభివృద్ధితోపాటు రైతులకూ భారీగా మేలు జరగనుంది.

ఆర్బీకేల అనుసంధానంతో మేలు

పీఏసీఎస్‌లతో ఆర్బీకేలను అనుసంధానించే ప్రక్రియను ప్రభుత్వం మొదలుపెట్టింది. దీనివల్ల కౌలు రైతులకు విరివిగా రుణాలు మంజూరు చేయడానికి అవకాశం ఏర్పడుతుంది. ఈ మేరకు కౌలు రైతుల గ్రూపులను మ్యాపింగ్ చేస్తున్నారు. అలాగే ధాన్యం, ఇతర పంటలను కొనుగోలు చేసే బాధ్యతను పీఏసీఎస్‌లకు అప్పగించడం వల్ల అవినీతికి ఆస్కారం లేకుండా రైతుల ఖాతాల్లోనే నేరుగా సొమ్ము జమ అవుతోంది. ఆనందపురం మండలంలో ఆనందపురం, వేములవలస, శొంఠ్యాంలో సహకార సంఘాలు ఉండగా వాటిని ఆధునీకీకరించి మౌలిక వసతులు కల్పించారు.



ఆనందపురం సహకార సంఘం కార్యాలయంలో రైతుకు చెక్కు అందజేస్తున్న డీసీసీబీ చైర్మన్ కోలా గురువులు, పీఏసీఎస్ అధ్యక్షుడు పొండ్రంకి అప్పారావు, సిబ్బంది (ఫైల్)

సహకార సంఘం	ఆనందపురం	శొంఠ్యాం	వేములవలస
రైతులు	1015	737	1205
పంట రుణాలు	రూ.2.10 కోట్లు	రూ.1.27 కోట్లు	రూ.1.96 కోట్లు
జేఎల్‌బీ గ్రూపులకు	రూ.16 లక్షలు	రూ.81.33 లక్షలు	రూ.11 లక్షలు
ఎస్‌టీ అదర్స్ రుణాలు	రూ.2.70 లక్షలు	రూ.20 లక్షలు	రూ.76 లక్షలు
బంగారు ఆభరణాలపై రుణాలు	రూ.7 కోట్లు	రూ.2.73 కోట్లు	రూ.2 కోట్లు



శొంఠ్యాం సహకార సంఘంలో రైతుల వివరాలు ఆన్‌లైన్ చేస్తున్న ఉద్యోగి



ఆనందపురం సహకార సంఘ కార్యాలయం

రుణం తీసుకుని ఇటుక వ్యాపారం



గతంలో సహకార సంఘాల ద్వారా వేల రూపాయలు మాత్రమే రుణమిచ్చేవారు. దీంతో దేనికీ ఉపయోగపడని పరిస్థితి. కానీ సహకార సంఘాల్లో సంస్కరణలు చేపట్టిన తర్వాత రుణ మంజూరు పరిమితిని పెంచారు. దీంతో ఎస్‌టీ అదర్స్ రుణం కింద రూ.3 లక్షలు మంజూరు చేశారు. ఆ మొత్తంతో ఇటుక వ్యాపారం చేసుకుంటున్నా. ప్రస్తుతం ఉపాధి మెరుగైంది.

– రెల్లి గురునాయుడు, జగన్నాథపురం

స్థానికంగానే రైతులకు రుణాలు



సహకార సంఘాల ద్వారా పారదర్శకంగా రుణాలు మంజూరు చేస్తున్నారు. ముఖ్యంగా స్థానికంగానే రైతులకు రూ.5 లక్షల వరకు రుణం మంజూరు చేయడం ఎంతో వెసులుబాటుగా మారింది. రుణ మంజూరుకు ఎవరూ లంచాలు ఆశించడం లేదు. ఆన్‌లైన్ ద్వారా చెల్లింపులు చేయడంతో పారదర్శకంగా ఉంది. మధ్యవర్తులను ఆశ్రయించకుండా రైతులే నేరుగా రుణాలు పొందే విధంగా తీసుకున్న చర్యలు బాగున్నాయి.

– పాలూరి నరిసింగరావు, రైతు జగ్గరాజుపాలెం.

క్లుప్తంగా

పాత మూలకుద్దులో వన సమారాధన



సీతారామాలయంలో అన్నసమారాధనలో మూలకుద్దు గ్రామస్తులు

తగరపువలస: భీమిలి మండలం పాత మూలకుద్దులో గ్రామస్తులు ఆదివారం వన సమారాధన ఏర్పాటు చేశారు. స్థానిక సీతారామాలయ కమిటీ ఆధ్వర్యంలో మహిళలు, యువకులు అన్నప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి పలువురు సహాయ సహకారాలు అందించారు.

ప్లాస్టిక్ వ్యర్థాలతో వసతి



నమ్మివానిపేట డంపింగ్‌యార్డులో ప్లాస్టిక్ సీసాలతో ఏర్పాటు చేసిన షెల్టర్

తగరపువలస: జీవీఎంసీ రెండో వార్డు నమ్మివానిపేట డంపింగ్‌యార్డులో పారిశుధ్య కార్మికులు ప్లాస్టిక్ వ్యర్థాలతో షెల్టర్ ఏర్పాటు చేసుకున్నారు. రోజూ క్లాప్ వాహనాల ద్వారా డంపింగ్‌యార్డుకు వచ్చే ప్లాస్టిక్ వాటర్ బాటిళ్లు, కూల్ డ్రింక్స్, సీసాలతో సిమెంట్ బెంచీలకు మూడు వైపులా, పైన వీటిని దండలా గుచ్చి అమర్చారు. వర్షాలకు తడవకుండా యార్డుకు వచ్చే ప్లాస్టిక్ షీట్లు వేశారు. డంపింగ్‌యారులో వన సమారాధనకు వచ్చే వారు ఈ ప్లాస్టిక్ వ్యర్థాల షెల్టర్లలో సేద తీరుతున్నారు.

విశ్వేశ్వరునికి అన్నాభిషేకం



చిట్టిల్ల అగ్రహారంలోని ఆలయంలో అన్నాభిషేకం చేస్తున్న నరేష్ శర్మ

తగరపువలస: భీమిలి మండలం తాళ్లవలస పంచాయతీ చిట్టిల్ల అగ్రహారంలో ఇటీవల కృష్ణ శిలతో నూతనంగా ప్రతిష్ఠించిన మహాగణపతి, అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో విశేష అభిషేకాలు చేశారు. విశ్వేశ్వరునికి అన్నాభిషేకం, మహాన్యాస పూర్వక విశేష అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా 4 వేల మందికి అన్నసంతర్పణ ఏర్పాటు చేశారు. భక్తుల సహాయ సహకారాలతో ఆలయ ధర్మకర్త అయ్యల సోమయాజుల నరేష్‌శర్మ దంపతులు ఈ కార్యక్రమాలు నిర్వహించారు.

నిరాశ్రయులకు దుప్పట్ల పంపిణీ



దుప్పట్లు పంపిణీ చేస్తున్న రామలక్ష్మి

తగరపువలస: అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా అంబేద్కర్ కూడలిలో రాష్ట్ర విపత్తు శాఖ సీనియర్ ఉపాధ్యక్షురాలు శీరపు రామలక్ష్మి 50 మంది నిరాశ్రయులకు దుప్పట్లు, రగ్గులు, పాలు, బిస్కెట్లు, పండ్లు ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాజ్యాంగం ప్రతి వ్యక్తికీ కొన్ని హక్కులు కల్పించిందన్నారు. మానవ హక్కులకు భంగం కలిగితే సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయాలన్నారు. మానవ హక్కుల కోసం ఏటా వివిధ ప్రదేశాల్లో అవగాహన కలిగిస్తున్నట్టు ఆమె తెలిపారు. కురుమెళ్ల కవిత, శీరపు ధరణి, వెంకటేశ్వరరావు, వెంకటరెడ్డి, సుబ్రహ్మణ్యం, భార్గవ్, సాయి సుజిత్, రాజీవ్, ప్రేమ్ సాయి తదితరులు పాల్గొన్నారు.

హక్కులతో స్వేచ్ఛాయుత జీవనం

భీమునిపట్నం: ప్రజలకు హక్కులు ఉన్నప్పుడే వారు స్వేచ్ఛాయుత జీవనాన్ని గడపగలరని జిల్లా విద్య శిక్షణ సంస్థ (డైట్) వైస్ ప్రిన్సిపాల్ గొట్టేటి రవి అన్నారు. ప్రపంచ మానవహక్కుల దినోత్సవం సందర్భంగా ఛాత్రోపాధ్యాయులకు ఆదివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హక్కులు లేకపోతే బానిసత్వంతో దుర్భర జీవితం గడపాల్సి వస్తుందన్నారు. మన దేశంలో అందరికీ సమాన హక్కులు కల్పించారన్నారు. శిక్షణ పొందుతున్న వారంతా ఉపాధ్యాయులుగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత హక్కులు, బాధ్యతలపై విద్యార్థులకు అవగాహన కలిగించి ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలని సూచించారు.



మాట్లాడుతున్న వైస్ ప్రిన్సిపాల్ గొట్టేటి రవి

మానవ హక్కులతో సమ సమాజం

తగరపువలస: సమసమాజ స్థాపనకు మానవ హక్కులు దోహదపడతాయని ఆదర్శ హిందీ ప్రేమీ మండలి భీమిలి అధ్యక్షుడు కె.ఎస్.ఆర్.కృష్ణారావు అన్నారు. ప్రపంచ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా ఆదివారం భీమిలిలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. 1948లో మానవ హక్కులపై 10 నిబంధనలు రూపొందించి ఐక్యరాజ్య సమితిలో సభ్య దేశాలు ఏకగ్రీవంగా ఆమోదించాయన్నారు. సభ్యదేశాల్లో మానవ హక్కులకు భంగం కలిగితే ఐక్యరాజ్యసమితికి చర్యలు తీసుకునే అధికారం ఉందన్నారు. మండలి గౌరవ అధ్యక్షుడు గంటా నూకరాజు, తదితరులు పాల్గొన్నారు.

క్యారమ్ టోర్నమెంట్ ప్రారంభం

కొమ్మాది: ఆల్ ఇండియా క్యారమ్ ఫెడరేషన్ 28వ ఫెడరేషన్ కప్ టోర్నమెంట్ ఆదివారం గీతంలో ఉత్సాహంగా ప్రారంభమైంది. నాలుగు రోజులపాటు నిర్వహించనున్న ఈ మెగా ఈవెంట్‌ను ఇంటర్నేషనల్ క్యారమ్ ఫెడరేషన్ ప్రెసిడెంట్ జోసెఫ్ మేయర్, ఆల్ ఇండియా క్యారమ్ ఫెడరేషన్ ప్రెసిడెంట్ రకిబుల్ హుస్సేన్ ప్రారంభించారు. టోర్నమెంట్‌లో అనేక రాష్ట్రాల నుంచి దాదాపు 400 మంది క్రీడాకారులు పాల్గొననున్నారు. ఈ సందర్భంగా జోసెఫ్ మేయర్ మాట్లాడుతూ టోర్నమెంట్‌లో యువత ఎక్కువగా పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో గీతం ప్రో వీసీ గౌతమరావు, అతిథులు ఎస్.మదన్‌రాజు, టి.ప్రవీణ్ కుమార్, అబ్దుల్ జలీల్, డాక్టర్ విజయ్‌కుమార్ ఉపాధ్యాయ్ పాల్గొన్నారు.



క్యారమ్ టోర్నమెంట్ ప్రారంభిస్తున్న ఫెడరేషన్ ప్రెసిడెంట్ జోసెఫ్ మేయర్

ప్రమాదాలకు నిలయంగా సబ్బివానిపేట సర్వీస్ రోడ్డు



సర్వీస్ రోడ్డుపై నీరు నిలిచిపోవడంతో కుడివైపు నుంచి ప్రయాణిస్తున్న కారు



రహదారి మధ్య నుంచి వస్తున్న వాహనాలు

రోడ్డుపై వర్షం నీరు నిలిచిపోవడంతో వాహనదారులకు ఇబ్బందులు

తగరపువలస: స్థానిక సబ్బివానిపేట వద్ద సర్వీస్ రోడ్డు వర్షాలు కురిసిన ప్రతిసారీ ప్రమాదాలకు నిలయంగా మారుతోంది. సంగివలస చెరువు నిండిపోవడంతో తరచూ వర్షం కురిసినప్పుడు ఎక్కువ మొత్తంలో నీరు ఇక్కడ రహదారిపై నిలిచిపోతుంది. విశాఖ నుంచి తగరపువలస వైపు వచ్చే వాహనాలు ఈ సర్వీస్ రోడ్డుకు ఎడమ భాగంలో ఎక్కువగా నీరు ఉండడంతో కుడి భాగం వైపు మార్గంలో వేగంగా వస్తున్నాయి. ఇదే సమయంలో సబ్బివానిపేట ఫ్లై ఓవర్ కింద నుంచి వాహనాలు సంగివలసకు వెళ్లేటప్పుడు అకస్మాత్తుగా ఎదురుగా వస్తున్న వాహనాలను చూసి వేగాన్ని నియంత్రించుకోలేకపోతున్నాయి. సర్వీస్ రోడ్డుపై నీరు నిలిచి ఉండటం వల్లే విశాఖ నుంచి వచ్చే వాహనాలు సర్వీస్‌రోడ్డులో ఎడమ పక్క నుంచి కాకుండా కుడివైపు వస్తూ ప్రమాదాలకు కారణమవుతున్నాయని వాహనదారులు అంటున్నారు. సరిగ్గా అదే ప్రదేశంలో నీటిలో మునిగిన స్పీడ్ బ్రేకర్ ఉండడంతో ప్రమాదాలకు మరొక కారణమని అంటున్నారు. ప్రమాదాల నివారణకు సబ్బివానిపేట వద్ద ఇరువైపులా సర్వీస్ రోడ్డుపై నీరు నిల్వ లేకుండా ఇరిగేషన్, నేషనల్ హైవే, జీవీఎంసీ, పోలీస్ శాఖలు సమన్వయంతో పనిచేయాలని వాహనదారులు కోరుతున్నారు.

ఘనంగా బ్రాహ్మణుల కార్తీక సమారాధన

సింహాచలం: సింహాచలం ప్రాంతానికి చెందిన శ్రీ వరాహ లక్ష్మీనృసింహ బ్రాహ్మణ సంక్షేమ సంఘం కార్తీక వన సమారాధన శ్రీ కృష్ణాపురంలోని కాశీ రాము తోటలో ఆదివారం ఘనంగా జరిగింది. వేదికపై పరమేశ్వరుడికి రుద్రాభిషేకం నిర్వహించారు. మహిళలు సామూహికంగా కుంకుమార్చన చేశారు. చిన్నారులు, మహిళలకు పలు ఆటల పోటీలు నిర్వహించారు.పెద్ద ఎత్తున బ్రాహ్మణ కుటుంబాలు కార్తీక వన సమారాధనకు తరలివచ్చారు. ఈ సందర్భంగా సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా వడ్లమాని శ్రీనివాసరావు, అధ్యక్షుడిగా ఎ.ఫణీంద్రశర్మ, కార్యదర్శిగా కొల్లూరి సుబ్బారావు, కోశాధికారిగా టి.జగన్నాథం, ముఖ్య సలహాదారుగా ఎంఎల్.నరసింహ ఎన్నికయ్యారు.

రాంబాబుకు అభినందనలు



పద్మనాభం: తిరుపతిలో మా అసోసియన్ తరఫున మూడు రోజులు నిర్వహించిన 42వ రాష్ట్ర మాస్టర్ అథ్లెటిక్ చాంపియన్‌షిప్ – 2023 పోటీల్లో అనంతవరం గ్రామానికి చెందిన కె.రాంబాబు నాలుగు బంగారు పతకాలు కై వసం చేసుకోవడంతో పలువురు అభినందనలు తెలిపారు. సింహాచలం ఏపీఎస్ఆర్‌టీసీ డిపోలో కండక్టర్‌గా పని చేస్తున్న రాంబాబు 100 మీటర్లు, 200 మీటర్లు, 400 మీటర్లు, 400 మీటర్ల రిలే రన్నింగ్ విభాగంలో ఈ మెడళ్లు సంపాదించాడు. ఎస్వీ యూనివర్సిటీ ఎస్‌టీఆర్ స్టేడియంలో ఈ నెల 8 నుంచి 10 వరకు పోటీలు జరిగాయి.

ఇస్కాన్‌లో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో రాధాకృష్ణులు

కొమ్మాది: సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో ఆదివారం వారాంతపు పూజల్లో భాగంగా హరేకృష్ణ, హరేరామ నామస్మరణతో ప్రత్యేక పూజలు చేశారు. రాధాకృష్ణులు, సుభద్ర, బలభద్ర, జగన్నాథుడు, సీతారాములు, ఆంజనేయ, నరసింహస్వామి విగ్రహాలను వివిధ వర్ణాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. స్వామివారి లీలలు, మహిమలను వర్ణిస్తూ భక్తులు భజనలు, గీతాలాపన చేశారు.

ఇంజినీరింగ్ విద్యార్థి అదృశ్యం

తగరపువలస: సంగివలస అనిట్స్‌లో మెకానికల్ ఇంజినీరింగ్ ఫైనల్ ఇయర్ విద్యార్థి పైల గౌతం రాజు ఈ నెల 8న అదృశ్యమయ్యాడు. మధురవాడకు చెందిన విద్యార్థి అదే రోజు కళాశాలకు వచ్చి తండ్రి పైడిరాజుకు ఫోన్ చేసి ఫీజు కట్టాలని చెప్పగా రూ.18 వేలు ఫోన్ పే చేశాడు. తర్వాత కళాశాల నుంచి ఇంటికి రాకపోవడంతో తగరపువలసలో ఉంటున్న గౌతంరాజు బాబాయ్ అప్పలరాజు కళాశాలకు వచ్చి విచారించాడు. ఆ రోజు మధ్యాహ్నం 12.30 వరకు గౌతంరాజు కళాశాలలో ఉన్నాడని, ఫీజు చెల్లించలేదని తెలిపారు. అతని ఫోన్ కూడా స్విచ్ ఆఫ్ చేసి ఉండడంతో ఆదివారం భీమిలి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఏఎస్‌ఐ సింహాచలం కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ముగిసిన శ్రీవారి పవిత్రోత్సవాలు

కొమ్మాది: రుషికొండలో గల శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పవిత్రోత్సవాలు నాలుగో రోజు అత్యంత వైభవంగా ఆదివారం ముగిశాయి. ఉదయం 10.30 గంటల నుంచి 11.30 వరకు ఉత్సవమూర్తులకు అత్యంత వైభవంగా స్నపన తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం 6 గంటల నుంచి 8 వరకు పూర్ణాహుతి టీటీడీ వేద పండితులు, అర్చకులు నిర్వహించారు. సాయంత్రం శ్రీవారి ఆలయ మాఢవీధుల్లో తిరుచ్చి ఉత్సవం ఘనంగా నిర్వహించారు. శ్రీవారి ఉత్సవమూర్తులను మాఢ వీధుల్లో మంగళవాయిద్యాల నడుమ వేలాది మంది భక్తుల సమక్షంలో ఊరేగించారు. టీటీడీ ఆలయ ఏఈవో జగన్మోహనాచార్యులు భక్తులకు అసౌకర్యం లేకుండా పర్యవేక్షించారు. ఆలయ సూపరింటెండెంట్, ఇన్‌స్పెక్టర్లు వెంకటరమణ, శివ, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.



మాఢవీధుల్లో శ్రీవారి ఉత్సవ విగ్రహం ఊరేగిస్తున్న అర్చకులు, భక్తులు

అనంతుని దీపోత్సవ ఏర్పాట్లు పరిశీలన



అనంతుని దీపోత్సవ ఏర్పాట్లపై సీఐతో చర్చిస్తున్న ముత్తంశెట్టి మహేష్, నాయకులు

పద్మనాభం: పద్మనాభంలో మంగళవారం నిర్వహించనున్న అనంత పద్మనాభ స్వామి దీపోత్సవ ఏర్పాట్లను వైఎస్సార్ సీపీ భీమునిపట్నం నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్తంశెట్టి మహేష్ ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ శాఖ, విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా విద్యుత్ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. దీపోత్సవానికి వచ్చే భక్తులకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కంటుబోతు రాంబాబు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు, ఈవో నానాజీ బాబు, సీఐ ఎస్.సన్యాసినాయుడు, వైఎస్సార్ సీపీ నాయకులు తాలాడ పద్మనాభం, మొకర అప్పలనాయుడు, బోని సన్యాసినాయుడు, తాలాడ నరిసింహనాయుడు పాల్గొన్నారు.

తీరం.. జనసంద్రం



రుషికొండ బీచ్ వద్ద జన సమూహం

కొమ్మాది: కార్తీకమాసం పిక్నిక్ సీజన్ కావడంతో ఆదివారం బీచ్‌రోడ్డులోని పర్యాటక ప్రాంతాలు జనసందోహంతో కిక్కిరిసిపోయాయి. సాగర్‌నగర్, రుషికొండ బీచ్, రామానాయుడు ఫిల్మ్ స్టూడియో, మంగమారిపేట బీచ్, రామాద్రి తీరం, ఎర్రమట్టి దిబ్బలు, భీమిలి బీచ్ ఉదయం నుంచి సాయంత్రం వరకు వేలాది మంది పర్యాటకులతో తీర్థంలా కనిపించాయి. చిన్నారుల నుంచి పెద్దల వరకు సముద్ర స్నానాలు చేస్తూ, ఆటపాటలతో ఉత్సాహంగా గడిపారు.

బీసీ సంఘాల సమస్యలు పరిష్కరించాలి



వన సమారాధనలో తెలకుల సంఘ సభ్యులు

భీమునిపట్నం: విశాఖ తెలకుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం అఖిల గాండ్ల, తెలకుల దేవతీకుల సభ్యులు జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో భీమిలి దొరతోట వద్ద తోటలో కార్తీక వన సమారాధన ఉత్సాహంగా నిర్వహించారు. విశాఖ ఉత్తర నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త కె.కె.రాజు, భీమిలి నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి ముత్తంశెట్టి మహేష్, 3వ వార్డు పార్టీ ఇన్‌చార్జి మైలిపల్లి షణ్ముఖరావు, జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యులు గొట్టిపల్లి వెంకటరావు, వీరవిల్లి పెదబాబు, పోలిపిల్లి అప్పలరాజు, గ్రోసు సుబ్బారావు, దాడి సత్యనారాయణ, బొర్రా మధుసుదన్ ఇతర ముఖ్య సభ్యులు పాల్గొన్నారు. వీరు మాట్లాడుతూ బీసీ సంఘాల అవసరాలు, ఇబ్బందులు ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు, పోటీలు, ఆటలు అందరినీ ఆకట్టుకున్నాయి.